



6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి

తాడేపల్లిరూరల్: కొలనుకొండలో నిర్మిస్తున్న గోకుల క్షేత్రంలో ఈనెల 6,7 తేదీల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నట్లు గోకులక్షేత్రం అధ్యక్షుడు వంశీధర దాస తెలిపారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద గురువారం 3,920 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 176 క్యూసెక్కులు వదిలారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 523.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్ఎల్బీసీకి 450 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

యార్డును సందర్శించిన మూడు రాష్ట్రాల కార్యదర్శులు



కొరిటిపాడు(గుంటూరు): తమిళనాడు, కర్నాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన మార్కెటింగ్‌శాఖ సిబ్బంది, కార్యదర్శులు మూడు నెలల శిక్షణలో భాగంగా గురువారం గుంటూరులోని మిర్చి యార్డును సందర్శించారు. యార్డులో జరుగుతున్న క్రయ, విక్రయాలు.. మిర్చి యార్డుకు ఏఏ జిల్లాలు, రాష్ట్రాల నుంచి మిర్చి రైతులు తరలి వస్తారు.. ఏఏ రకాల మిర్చి వస్తుంది.. ఏఏ రకాలకు ఎంతెంత ధర లభిస్తుంది.. మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు ఏ విధంగా వ్యవహరిస్తారు.. రైతులకు యార్డులో కల్పిస్తున్న వసతులు, మిర్చిని కొనుగోలు చేసిన తర్వాత రైతులకు ఎన్ని రోజుల్లో డబ్బు చెల్లిస్తారు.. తదితర అంశాలపై యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ, యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డిలు వారికి వివరించారు. అనంతరం యార్డు ఆవరణలోని సమావేశ మందిరంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజానారాయణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ ప్రభుత్వం కేటాయించిన విధులను కార్యదర్శులు బాధ్యతగా నిర్వర్తిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని గుర్తుచేశారు. కార్యదర్శులు తీసుకునే నిర్ణయాలపై వేల కుటుంబాలు ఆధారపడి ఉంటాయని, ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో మార్కెటింగ్‌శాఖ సంయుక్త సంచాలకులు కె.శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు బి.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేహదారుఢ్య పరీక్షలు



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): గుంటూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో మహిళా ఎస్ఐ అభ్యర్థులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు గురువారం కొనసాగాయి. గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, ఒంగోలు పీటీసీ ప్రిన్సిపాల్ ఎ.ఆర్.దామోదర్ పోటీలను పరిశీలించారు. అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలు తనిఖీ చేశారు. అనంతరం అభ్యర్థుల చాతీ, ఎత్తు కొలతలను మహిళా పోలీస్ సిబ్బంది తీసుకున్నారు. 1,600 మీటర్లు, 100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. మహిళా అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులూ తలెత్తకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. ఏఎస్పీలు కె.సుప్రజ (గుంటూరు), హైమావతి (ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు), గుంటూరు రేంజ్‌లోని కొందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీస్ అధికార/సిబ్బంది, ఐజీ కార్యాలయపు సీఐ సుధాకర్, మినిస్టీరియల్ సిబ్బంది పాల్గొన్నారు.

9న జాతీయ మెగా లోక్‌అదాలత్



నగరంపాలెం: గుంటూరు జిల్లాలోని ప్రతి కోర్టులో ఈనెల 9న జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ తెలిపారు. జిల్లాలోని సబ్ డివిజన్ల పోలీస్ అధికారులు, పోలీస్‌స్టేషన్ల సీఐలతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి జూమ్ వీడియో ద్వారా ఎస్పీ మాట్లాడారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో వీలైనంత త్వరగా ఎక్కువ కేసులు పరిష్కరించాలని అన్నారు. జిల్లాలో ఏదైనా రోడ్డు ప్రమాదం జరిగితే రాష్ట్ర డీజీపీ ఉత్తర్వుల ప్రకారం ఫామ్ నంబర్ ఒకటిని 48 గంటల్లో పూర్తి చేయాలని చెప్పారు. ఫామ్ నంబర్లు 5, 7 నిర్దేశించిన సమయంలో పూర్తి చేసి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రోడ్డు ప్రమాదాల కేసుల్లో బాధితులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ గ్రేవ్, ముఖ్యమైన కేసుల్లో విచారణ అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు సంయుక్తంగా కోర్టుకు హాజరై, కేసులు వీగి పోకుండా దోషులకు కోర్టులో శిక్ష పడేలా వ్యవహరించాలని అన్నారు. ట్రాఫిక్ డీఎస్పీ బాలసుందర రావు, ఎస్బీ ఇన్‌చార్జి సీఐ బాలసుబ్రమణ్యం, డీసీఆర్బీ సీఐ అనూరాధ, ఎస్ఐ వెంకటకృష్ణ పాల్గొన్నారు.

కూలిబిడ్డల ఉన్నతికి ఉద్యోగాల విప్లవం

- తొలుత వివిధ కోర్సుల్లో శిక్షణ
- శిక్షణ కాలంలో రోజుకూలి, భోజనం, దుస్తులు, పుస్తకాలు, వైద్యసదుపాయం
- బాపట్ల కేంద్రంగా సెప్టెంబర్ 1 నుంచి శిక్షణ
- ఆ తరువాత ఉద్యోగావకాశాల కల్పన
- వంద రోజుల పని పూర్తి చేసుకున్న ఉపాధిహామీ కూలీల కుటుంబాల శ్రేయస్సే లక్ష్యం
- సర్వత్రా వ్యక్తమవుతున్న హర్షం



ఉన్నతి పథకంలో భాగంగా గుంటూరులో నిరుద్యోగులకు శిక్షణ(ఫైల్)

సాక్షి ప్రతినిధి, బాపట్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నిరుపేదలకు పనులు కల్పిస్తూ ఆదుకుంటున్న ప్రభుత్వం చదువుకున్న కూలీల బిడ్డలకు ఉద్యోగాలు కల్పించేందుకు సిద్ధమైంది. ఇందుకోసం నిరుద్యోగులకు వివిధ సాంకేతిక కోర్సులలో శిక్షణ ఇచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది. ఉన్నతి పథకం ద్వారా వీటిని నిర్వహిస్తోంది. ఇప్పటికే గుంటూరు, పల్నాడు జిల్లాల్లో నిరుద్యోగలకు శిక్షణ మొదలుకాగా సెప్టెంబర్ 1 నుంచి బాపట్ల జిల్లా వారికి శిక్షణ తరగతులు ప్రారంభం కానున్నాయి. శిక్షణ పూర్తికాగానే ప్రభుత్వం వారికి ఉద్యోగావకాశాలు కల్పించనుంది.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో ఉన్నతి పథకాన్ని అమలు చేస్తున్నారు. వంద రోజుల ఉపాధి హామీ పని పూర్తిచేసుకున్న కుటుంబాల్లోని నిరుద్యోగులు ఈ పథకానికి అర్హులు. దీనదయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌసల్య యోజన (డీడీయూజీకేవై) ద్వారా చదువుకున్న నిరుద్యోగ యువతకు పలు రకాల సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇస్తారు. ప్రధానంగా ఆటోమేటివ్ ప్రొడక్ట్ డిజైన్ లీడ్ ఇంజినీర్, క్యాడ్ టెక్నీషియన్, సేల్స్ సూపర్‌వైజర్, హోటల్ మేనేజ్‌మెంట్, ఎలక్ట్రికల్ అసెంబ్లీ ఆపరేటర్, డెస్క్ టాప్ పబ్లిషింగ్, డేటా ఎంట్రీ టెక్నికల్ కోర్సులతో పాటు సాఫ్ట్‌స్కిల్స్, కంప్యూటర్స్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిష్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లలో శిక్షణ ఇచ్చి ఆ తరువాత ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తారు.

18 నుంచి 45ఏళ్ల మధ్య యువత అర్హులు

అభ్యర్థులు పదో తరగతి, ఆపై చదివి ఉండాలి. ఉన్నతి పథకం కోసం ప్రభుత్వం ఇప్పటికే అర్హులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. డ్వామా ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం వేగంగా సాగుతోంది. ఫీల్డ్‌అసిస్టెంట్లు, ఏపీఓలు వంద రోజుల పని పూర్తిచేసిన వారి జాబితాలు తీసుకొని ఆ కుటుంబాల్లో ఉన్న నిరుద్యోగులను గుర్తిస్తున్నారు. మొదటి బ్యాచ్ కోసం 270 మంది లక్ష్యం కాగా ఇప్పటివరకు 120 మందిని అధికారులు గుర్తించారు. మిగిలిన వారిని గుర్తించే పనిలో ఉన్నారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య ఉన్నవారిని అర్హులుగా ఎంపిక చేశారు. ఒక్కో బ్యాచ్‌లో 30 నుంచి 35 మందికి శిక్షణ ఇవ్వనున్నారు. కోర్సును బట్టి 3 నుంచి 6 నెలల వరకు శిక్షణ ఉంటుంది. బాపట్ల ఐటీఐ కాలేజీతోపాటు గుంటూరు జిల్లాలోని ఏడు కేంద్రాలు, పల్నాడులోని మరో రెండు కేంద్రాలలో బాపట్ల జిల్లా అభ్యర్థులకు గుంటూరు జిల్లా డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నారు. తొమ్మిదినెలలపాటు శిక్షణ తరగతులు కొనసాగనున్నాయి.

శిక్షణలో భృతి

ఎంపిక చేసినవారికి శిక్షణకాలంలో రోజుకు రూ. 272 భృతి ఇస్తారు. హాస్టల్ వసతితోపాటు మూడు పూటలా ఉచితంగా భోజనం అందిస్తారు. దుస్తులు, పుస్తకాలతోపాటు ఉచిత వైద్య సదుపాయం కల్పిస్తారు. శిక్షణ పూర్తికాగానే ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధిహామీ కూలీల బిడ్డలకు ప్రభుత్వం ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. తొలుత ఉపాధికూలీల కుటుంబాలలో చదువుకున్న నిరుద్యోగులను గుర్తించి అర్హతను బట్టి ఉచితంగా సాంకేతిక కోర్సుల్లో శిక్షణ ఇస్తాం. సెప్టెంబర్ 1 నుంచి బాపట్ల వారికి శిక్షణ మొదలు కానుంది. అర్హులు సద్వినియోగం చేసుకోవాలి.

– రంజిత్‌బాషా, కలెక్టర్, బాపట్లజిల్లా

వేగంగా అర్హుల గుర్తింపు



ఉపాధిహామీ కూలీల కుటుంబాలలో చదువుకున్న వారిని గుర్తిస్తున్నాం. ఈ పని వేగంగా సాగుతోంది. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యం 270 మంది కాగా ఇప్పటివరకు 120 మందిని గుర్తించాం. మిగిలిన వారిని గుర్తించే పనిలో ఉన్నాం. ఆ వివరాలను డీఆర్‌డీఏ వారికి అందజేస్తున్నాం. వారి ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు ఉంటాయి.

– శంకర్‌నాయక్, డ్వామా పీడీ, బాపట్ల జిల్లా

గుంటూరు–బీబీనగర్ లైన్ డబ్లింగ్‌పై దృష్టి

డీఆర్ఎం ఎం.రామకృష్ణ



లక్ష్మీపురం(గుంటూరు): గుంటూరు–బీబీనగర్ లైన్ డబ్లింగ్ పనులపై దృష్టి సారించాలని డీఆర్ఎం ఎం.రామకృష్ణ సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో గురువారం డీఆర్‌యూసీసీ కమిటీ సభ్యులు, డివిజన్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డివిజన్‌లో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ గుంటూరు రైల్వే డివిజన్‌లోని సమస్యలను పరిష్కరించేందుకు డివిజన్ సిబ్బంది, అధికారులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. డివిజన్ పరిధిలో చేపట్టే నూతన అభివృద్ధి పనులకు కేంద్రం ఇప్పటికే నిధులు కేటాయించిందన్నారు. నూతన పనులను సకాలంలో పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రైళ్లలో సరుకు రవాణా, డివిజన్ ఆదాయాన్ని పెంచడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రైల్వేస్టేషన్‌లలో కోచ్ ఇండికేషన్ బోర్డులు, లిఫ్టులు, రైళ్లు ఆగిపోవడం, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, స్టేషన్‌లలో పార్కింగ్ సౌకర్యం, పరిశుభ్రత, రైల్వే పోలీసుల భద్రత గురించి చర్చించారు. సమావేశంలో ఏడీఆర్ఎం, డీఆర్‌యూసీసీ చైర్మన్ ఆర్.శ్రీనివాస్, సీనియర్ డీసీఎం, డీఆర్‌యూసీసీ బ్రాంచ్ కార్యదర్శి ఎం.దినేష్‌కుమార్, సీనియర్ డీఓఎం పి.కిరణ్, డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్ యార్డులో గురువారం క్వింటా నిమ్మకాయలు కనిష్ఠ ధర రూ.2,500, గరిష్ఠ ధర రూ.4,500, మోడల్ ధర రూ.3,500 వరకు పలికింది.

పథకాలను రైతు సంఘాలు అందిపుచ్చుకోవాలి

కలెక్టర్ శివశంకర్ లోతేటి

నరసరావుపేట రూరల్: ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకొని రైతు ఉత్పత్తిదారుల సంఘాలు అభివృద్ధి చెందాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, నాబార్డు ద్వారా అమలవుతున్న పథకాలపై కలెక్టర్ కార్యాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. నాబార్డు ద్వారా అమలవుతున్న వాటర్‌షెడ్, మా తోట గిరిజన అభివృద్ధి పథకాలతోపాటు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాలు, పొదుపు గ్రూపు మహిళలు, యువతకు శిక్షణ కార్యక్రమాలపై సమీక్షించారు. కలెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల సమన్వయంతో రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ముందుకెళ్లాలని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న మార్కెటింగ్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీసీఆర్సీ కార్డులు రైతులకు అందించేందుకు సంఘాలు చొరవ తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలపై ప్రతినెలా రెండో మంగళవారం అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటుచేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి బెన్నీ, జిల్లా వ్యవసాయ అధికారి మురళి, జిల్లా కో–ఆపరేటివ్ అధికారి నాగ శ్రీనివాస్, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ బాలునాయక్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శివశంకర్ లోతేటి

కాంతులు కురి'పించెన్'

ఈపక్క చిత్రంలో ఉన్న ఈమె పేరు మంచాల మరియమ్మ. వయస్సు 63. బాపట్ల మండలంలోని పూండ్ల గ్రామం. పక్షవాతం ఆమెను మంచానికే పరిమితం చేసింది. ఒక కూతురు, ఒక కొడుకు. పూట గడవడానికి ప్రతి పూటా బతుకు పోరాటం చేస్తుంటారు. వారికి అమ్మ ఆరోగ్యంపై ఎప్పుడూ దిగులే. మరియమ్మ భర్త కూడా వృద్ధాప్యం మీద పడడంతో పని చేయలేక సతమతమవుతున్నాడు. ఆయనకు మంచానికే పరిమితమైన భార్యను చూసినప్పుడల్లా కన్నీటి పొరలే. ఇదిగో ఈ కుటుంబానికి పెద్దబిడ్డను నేనంటూ అండగా నిలిచారు ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి. భర్తకు వృద్ధాప్య పింఛన్ అందిస్తూనే.. మరియమ్మకు దివ్యాంగ పెన్షన్ మంజూరు చేశారు. వలంటీర్ వచ్చి మీకు పింఛన్ వచ్చిందని చెప్పగానే మరియమ్మ శరీరంలోకి జవసత్వాలు వచ్చినట్లు ఒక్కసారిగా పైకి లేవడానికి యత్నించింది. ''అయ్యా.. సీఎం జగన్ బాబు చల్లగా ఉండాలయ్యా.. సొంత బిడ్డలా ఆదుకుంటున్నాడు'' అంటూ కళ్లలో నీటి సుడులతో రెండు చేతులూ జోడించింది.

- జిల్లాలో 5,152 నూతన పింఛన్ల మంజూరు
- నేడు ప్రతి ఇంటికీ వెళ్లి అందించనున్న వలంటీర్లు
- ఆనందం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

బాపట్ల అర్బన్ : అర్హులైన ఏ ఒక్కరూ సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఏటా రెండుసార్లు కొత్త లబ్ధిదారులను ప్రభుత్వం గుర్తిస్తోంది. ఆరు నెలలపాటు గుర్తించిన లబ్ధిదారులకు జనవరి, ఆగస్టు నెలల్లో పథకాలు మంజూరు చేస్తోంది. సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర సందర్భంగా పేదోళ్ల గుండె తడిని కళ్లారా చూశారు. వారి వేదనను మనసుతో ఆలకించారు. అందుకే రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందించేందుకు నవరత్నాలను ప్రజల ముంగిటకే తీసుకెళుతున్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది ఆగస్టు వరకు స్వీకరించిన వైఎస్సార్ పెన్షన్ కానుక దరఖాస్తులను పరిశీలించి అర్హుల జాబితా రూపొందించి నూతన పింఛన్లు మంజూరు చేశారు.

మొత్తం పెన్షన్లు 2,29,717

బాపట్ల జిల్లాలో జనవరి నుంచి జూలై వరకు కొత్త పెన్షన్ల కోసం వలంటీర్ల ద్వారా సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరించారు. వీటిని వెల్ఫేర్ అసిస్టెంట్లు పరిశీలించి అర్హుల జాబితా రూపొందించారు. ఈ మేరకు బాపట్ల జిల్లాలో 5,152 నూతన పింఛన్లు మంజూరు చేశారు. ఆగస్టులో బాపట్ల జిల్లాలో 2,24,565 మంది పింఛన్‌దారులకు రూ. 61.43 కోట్లు అందించారు. సెప్టెంబర్‌లో మొత్తం 2,29,717 మంది లబ్ధిదారులకు రూ. 62.70 కోట్లు పెన్షన్ కానుక విడుదల చేశారు.



మంచాల మరియమ్మకు పెన్షన్ మంజూరు పత్రం అందజేస్తున్న వలంటీర్

జగన్ బాబుకు రుణపడి ఉంటాం



రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. వయస్సు మీద పడుతోంది. పనికి వెళదామంటే ఆరోగ్యం సహకరించడం లేదు. ఒంట్లో బాగోకపోయినా ఏదో రకంగా పనులు చేసుకుంటూ నెట్టుకొస్తున్నాం. ఒక్కో రోజు ఎసట్లోకి బియ్యం కూడా ఉండవు. ఇప్పుడు ఇంటి వద్దకే వచ్చి పింఛన్ ఇస్తున్నారు. జగన్‌బాబుకు రుణపడి ఉంటాం.

– కాయల లలితమ్మ, గోపాపురం బాపట్ల మండలం

చాలా ఆనందంగా ఉంది:



మా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ పెన్షన్ దరఖాస్తు చేశాడు. నాకు పింఛన్ అర్హత ఉందో లేదో వాళ్లే తెలుసుకుని మరీ ఇంటికి వచ్చారు. అన్ని కాగితాలు సచివాలయం వాళ్లే చూసుకున్నారు. నీకు పింఛన్ వస్తుంది. అని చెప్పారు. చాలా ఆనందం అనిపించింది. ఈ వయసులో మాలాంటోళ్లకు చేతి కర్రలా పింఛన్ ఉపయోగపడుతుంది.

– సంజీవ సింగల్ రెడ్డి, వెదులపల్లి కొత్తపాలెం గ్రామం

మృతుల ఓట్ల తొలగింపుపై విచారణ



అమర్తలూరు మండలం గోవాడలో ఓటర్ల విచారణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్‌బాషా

అమర్తలూరు(వేమూరు) : ఓటర్ల జాబితా నుంచి మృతుల పేర్లు విచారణ చేయకుండా తొలగించరాదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రంజిత్ బాషా తెలిపారు. వేమూరు నియోజకవర్గంలోని అమర్తలూరు మండలం గోవాడలో జరుగుతున్న ఓటర్ల విచారణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ మృతులు, శాశ్వత వలసదారుల ఓట్లను తొలగించే సమయంలో ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలన చేయాలని ఆదేశించారు. ఇటీవల ఓట్లు తొలగించిన 11 గృహాలకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఓట్ల తొలగింపు పారదర్శకంగా జరిగిందని నిర్ధారించుకున్నారు. వేమూరు నియోజకవర్గంలోని ఓటర్ల జాబితాలో చనిపోయిన వ్యక్తులు 8,737 మంది ఉన్నారని వెల్లడించారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గం ఎన్నికల అధికారి ఉమ్మడి జిల్లా జెడ్పీ సీఈఓ జి.మోహనరావు, ఆర్డీఓ జి. రవీంద్ర, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ చేయకుండా ఓట్లు తొలగించొద్దు

బుద్ధాం(కర్లపాలెం): విచారణ చేయకుండా ఓట్లు తొలగించవద్దని బాపట్ల కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాష తెలిపారు. గురువారం కర్లపాలెం మండలంలోని బుద్ధాం గ్రామంలో కలెక్టర్ పర్యటించి మృతులు, శాశ్వతంగా వలస వెళ్ళిన వారి ఓట్ల వివరాలను వారి ఇళ్ళకు వెళ్ళి విచారణ చేశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్త లేకపోవటం, కేవలం ఐదుగురు చిన్నారులే ఉండటంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. రెండు అంగన్‌వాడీ కేంద్రాలను మిళితం చేసినా ఐదుగురు పిల్లలే ఉండటమేమిటని ఆయాను నిలదీశారు. తక్షణమే విచారణ చేసి నివేదిక పంపాలని ఆర్డీఓ రవీందర్‌ను ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ కేశవనారాయణరావు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు ఆర్డీఓ జి.రవీందర్, పంచాయతీ కార్యదర్శి డి.పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అమృతలింగేశ్వరుడికి వెండి కవచం



జగ్గయ్యపేట: మండలంలోని ముక్త్యాల గ్రామంలో వేంచేసిన కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో కొలువైన అమృతలింగేశ్వరుడికి దాతలు గురువారం వెండి కవచం అందజేశారని ఈఓ శిరీష తెలిపారు. జగ్గయ్యపేటకు చెందిన విజయలక్ష్మి దంపతులు రూ.లక్ష వెచ్చించి సుమారు కిలో వెండితో తయారు చేసిన కవచాన్ని అందజేశారు. దాతలకు స్వామి వారి ప్రసాదాలు అందించి, శేషవస్త్రంతో సత్కరించారు.

రూ.90.09 లక్షలకు కొబ్బరి చెక్కల టెండర్

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించిన కొబ్బరి చెక్కలను పోగు చేసుకునే హక్కు టెండర్‌ను అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు దక్కించుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని మహా మండపం ఆరో అంతస్తులో ఏఈఓ చంద్రశేఖర్ పర్యవేక్షణలో గురువారం ఈ టెండర్ ప్రక్రియ కొనసాగింది. బహిరంగ వేలం, సీల్డ్ టెండర్, ఈ–టెండర్ విధానం ద్వారా ఈ ప్రక్రియను నిర్వహించారు. విజయవాడకు చెందిన అమృత ట్రేడర్స్, శ్రీనివాస స్టోర్స్, ఎం.విజయ్‌చంద్ సప్లయర్స్ ప్రతినిధులు రూ.5 లక్షలు ప్రథమ ధరావత్తుగా చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన్నారు. దేవస్థానం పాటను రూ.85 లక్షలుగా నిర్ణయించి వేలాన్ని ప్రారంభించింది. బహిరంగ మార్కెట్‌లో కొబ్బరి ధర లేకపోవడంతో అంత మొత్తానికి తాము పాట కొనసాగించలేమని కాంట్రాక్టర్లు చెప్పడంతో దేవస్థానం పాటను రూ.80 లక్షలకు తగ్గించింది. అనంతరం కాంట్రాక్టర్లు పాటను క్రమంగా రూ.86 లక్షల వరకు తీసుకెళ్లారు. అక్కడి నుంచి పాట ముందుకు వెళ్లకపోవడంతో అధికారులు సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరిచారు. సీల్డ్ టెండర్ బాక్స్‌లో అమృత ట్రేడర్స్ రూ.90,09,999లకు కోట్ చేసింది. దీంతో అమృత ట్రేడర్స్ అత్యధిక మొత్తానికి పాటను దక్కించుకున్నట్లు అధికారులు ప్రకటించారు. వేలం వివరాలతో ఆలయ ఈఓ భ్రమరాంబకు నివేదిక ఇస్తామని ప్రకటించారు.



సీల్డ్ టెండర్ బాక్స్‌ను తెరుస్తున్న అధికారులు

కొండలమ్మకు వెండి పళ్లెం సమర్పణ

గుడ్లవల్లేరు(గుడివాడ): మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో వేంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారికి గుడివాడకు చెందిన జి.వెంకట కిశోర్ గురువారం వెండి పళ్లెం సమర్పించారు. ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ కానూరి సురేష్‌కు 925 గ్రాముల వెండి తాంబూలపు పళ్లెం అందజేశారు. భక్తుడి పేరిట అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు.



కౌలు రైతుకూ భరోసా

- 6,987 మంది రైతులకు రూ.5.24 కోట్లు లబ్ధి
- నేడు బటన్ నొక్కి ఖాతాలకు జమ చేయనున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కొరిటిపాడు(గుంటూరు): తోటి రైతుల నుంచి భూమి కౌలుకు తీసుకుని పంట సాగు చేసే కౌలుదారులకు కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 'రైతు భరోసా' పథకం ద్వారా సాయం అందిస్తోంది. ఈ ఏడాదికి సంబంధించి మొదటి విడత జూన్ మాసంలో ఇప్పటికే వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ద్వారా 1,16,700 మంది రైతులకు రూ.87.53 కోట్లు జమ చేశారు. తాజాగా కౌలు రైతులకు కూడా భరోసా అందిస్తున్నారు. గుంటూరు జిల్లాకు సంబంధించి 6,987 మంది కౌలు రైతులకు రూ.5 కోట్ల, 24 లక్షల, 2 వేల 500 మంజూరైనట్లు జిల్లా వ్యవసాయశాఖ అధికారి నున్నా వెంకటేశ్వర్లు గురువారం 'సాక్షి'కి తెలిపారు. శుక్రవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి కౌలుదారుల బ్యాంకు ఖాతాల్లోకి భరోసా సొమ్మును జమ చేయనున్నారని వెల్లడించారు.

మహిళల హక్కులపై అవగాహన అవసరం

నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లికి చెందిన హెల్ప్ ఫౌండేషన్ రూపొందించిన మహిళల హక్కులపై అవగాహన అవసరం అనే కరపత్రాన్ని గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ బాలికలు, మహిళల పట్ల బాధ్యతగా నడుచుకోవాలని సూచించారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన

ఎమ్మెల్సీ పోతుల సునీత



హాస్టల్‌లో భోజనాన్ని పరిశీలిస్తున్న సునీత

వేటపాలెం: రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రైవేటుకు దీటుగా బోధన చేయాలని ఎస్సీ స్టాండింగ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత సూచించారు. ఆమె గురువారం మండలంలోని దేశాయిపేటలో గల మహాత్మా జ్యోతిరావు పూలే వెనకబడిన తరగతుల సంక్షేమ హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలో విద్యార్థులకు అందుతున్న సదుపాయాల్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రకటించిన మెనూ పాటిస్తున్నారా లేదా అని విద్యార్థుల్ని అడిగి తెలుకున్నారు. విద్య, వైద్యంపై సీఎం వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. నాడు–నేడు కింద రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల్ని కార్పొరేటుకు దీటుగా మార్చారని చెప్పారు. విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని గుర్తుచేశారు. ఆమె వెంట మల్లెల బుల్లిబాబు, ప్రిన్సిపాల్ విజయలక్ష్మి, సరోజినీదేవి ఉన్నారు.

సంపదనంతా అదానీ, అంబానీలకు దోచి పెడుతున్న కేంద్రం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

పర్చూరు (చినగంజాం): దేశంలోని సంపదనంతా అదానీ, అంబానీలకు కేంద్ర ప్రభుత్వం దోచి పెడుతోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ధ్వజమెత్తారు. గ్యాస్ ధరలు రూ.200 తగ్గించి ప్రజల్ని మోసం చేస్తున్నారని ఆయన విమర్శించారు. గురువారం పర్చూరు కోర్టుకు ఆయన హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గ్యాస్ కనెక్షన్ ఉన్నవారు కోటి మంది ఉంటే అందులో ఉజ్వల పథకం లబ్ధిదారులు కేవలం నాలుగు లక్షలు మాత్రమే ఉన్నారని తెలిపారు. జాతీయ రహదారుల పేరుతో కేంద్ర ప్రభుత్వం రైతుల్ని మోసం చేస్తోందని విమర్శించారు. ఎకరా భూమి రూ. 1.40 కోట్లకు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించిన కేంద్రం రైతులకు మాత్రం రూ.20 లక్షలు మాత్రమే చెల్లిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో రాజకీయం అస్తవ్యస్తంగా ఉందని, బీజేపీ ఆడినట్లు వైఎస్సార్ సీపీ, టీడీపీ, జనసేనలు ఆడుతున్నాయని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై. వెంకటేశ్వరరావు, పూనాటి ఆంజనేయులు, పెంట్యాల హనుమంతరావు, జి. ప్రతాప్‌కుమార్, మత్తె డేవిడ్, కట్టెంపూడి ప్రభుదాసు, జ్యోతి మార్కు, బండి శంకరయ్య, బండారు చిన్నదాసు పాల్గొన్నారు.

మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరు



ఉద్యోగ మంజూరు పత్రాలను అందజేస్తున్న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి తమ్మాజీరావు

పర్చూరు (చినగంజాం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బీఏఆర్ అండ్ టీపీ జూనియర్ కాలేజీలో గురువారం నిర్వహించిన మెగా జాబ్ మేళాకు 342 మంది హాజరయ్యారు. మొత్తం హాజరైన వారిలో 85 మందికి ఉద్యోగాలకు ఎంపికయ్యారని బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఈ. తమ్మాజీరావు తెలిపారు. జాబ్ మేళాకు అపెక్స్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్, మాల్‌టెక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్, హెటిరో డ్రగ్స్, ఫ్లెక్స్ టెక్ సొల్యూషన్స్, ఐసీఐసీఐ, సీఈటీసీ రెన్యూవబుల్ ఎనర్జీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, అమరరాజా బ్యాటరీస్, ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఫస్ట్ సోర్స్, హీరో మోటో కార్ప్ వంటి 11 కంపెనీలకు పైగా ప్రముఖ బహుళజాతి కంపెనీలు హాజరయ్యాయని చెప్పారు. జీతం వారి విద్యార్హతలను బట్టి రూ.10 వేలు నుంచి రూ. 35 వేలు వరకు ఉంటుందని తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి రాజారావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఒక సువర్ణ అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యంగ్ ప్రొఫెషనల్ హారిక సౌగంధి, మల్లీశ్వరి, ఏపీఎస్ఎస్‌డీసీ ప్లేస్‌మెంట్ ఎగ్జిక్యూటివ్ నాగ వెంకట్, కళాశాల ప్రిన్సిపాల్ ఈ. చింపారెడ్డి, సీహెచ్.వి.రవికిరణ్, ఏడీఎస్‌డీఈ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయిలో క్రీడా ఎంపికలు

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో 2023–24 విద్యాసంవత్సరానికి శుక్రవారం నుంచి ఈనెల 5వ తేదీ వరకు మండలస్థాయిలో క్రీడా ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ, స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి జి. ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈనెల 6వ తేదీ నుంచి 10 వరకు నియోజకవర్గ స్థాయిలో ఎంపికలను పూర్తి చేయాలని సూచించారు. కబడ్డీ, ఖోఖో, టెన్నికాయిట్, వాలీబాల్, త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్, షటిల్ బ్యాడ్మింటన్, యోగా, అథ్లెటిక్స్ లలో మండల, నియోజకవర్గస్థాయిలో ఎంపికలకు ఏర్పాట్లు చేసుకుని, సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. మండల, నియోజకవర్గస్థాయిఎంపికలు పూర్తవ్వగానే జిల్లాస్థాయిలో ఆయా క్రీడాంశాలతో పాటు మిగిలిన క్రీడల ఎంపికల షెడ్యూల్ త్వరలో ప్రకటిస్తామని తెలిపారు. క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు అకడమిక్ మానిటరింగ్‌లో విధిగా నమోదు చేసుకోవాలని, ఆ విధంగా చేయని క్రీడాకారులను ఎంపిక చేయ బోమని స్పష్టం చేశారు. అండర్–11, అండర్–14, అండర్–17 విభాగాల వారీగా పాల్గొనాలని సూచించారు.

డీ-13 విద్యుత్ శాఖ కార్యాలయం మార్పు

గుంటూరు ఈస్ట్: విద్యుత్ శాఖ డీ–13 నూతన కార్యాలయం నవభారత్‌నగర్ 1వలైనులోకి మార్చినట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసబాబు గురువారం తెలిపారు. గతంలో ఆర్టీసీ బస్టాండ్ వెనుక ఉన్న కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చినట్లు వెల్లడించారు. 1, 2, 57 వార్డులు డీ–13 సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. సీతారామ్‌నగర్, అంబేడ్కర్‌నగర్, అరుంధతీనగర్, మంగళదాస్‌నగర్, రాజగోపాలనగర్, డీఆర్టీనగర్, మద్దిరాల కాలనీ, షాప్ ఎంప్లాయీస్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ఎన్టీఆర్‌నగర్, ఇబ్రాయిల్‌పేట, గాంధీనగర్, రాహుల్ గాంధీనగర్, జియావుద్దీన్‌నగర్, నందివెలుగు రోడ్డు, నవభారత్ కాలనీ, రాఘువనగర్‌లు డీ–13 సెక్షన్ పరిధిలోకి వస్తాయన్నారు. వినియోగదారులు గమనించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే కార్యాలయం నంబరు 0863-22227712 సంప్రదించాలన్నారు.

ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు !

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

రేపల్లె రూరల్: విధుల నిర్వహణలో ఒత్తిడికిలోనై ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవద్దని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విజయవాడ మణిపాల్ వైద్యశాల గురువారం పోలీసులు, వారి కుటుంబ సభ్యులకు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ ఉద్యోగం అంటేనే పని ఒత్తిడితో పాటు మానసికంగా, శారీరక శ్రమ ఎక్కువ ఉంటుందని తెలిపారు. శిక్షణ సమయంలో సిబ్బంది చాలా దృఢంగా, ఆరోగ్యవంతంగా ఉంటారన్నారు. విధుల్లోకి వచ్చిన కొంతకాలానికి చాలామందికి పని ఒత్తిడి వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని పేర్కొన్నారు. పోలీస్ సిబ్బందికి వారి ఆరోగ్య సమస్యల్ని చెకప్ చేయించుకోవడానికి కూడా కొన్ని సందర్భాల్లో అవకాశం కూడా ఉండదని వివరించారు. డీఎస్పీ మురళీకృష్ణ మాట్లాడుతూ రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి మణిపాల్ హాస్పిటల్ వైద్య బృందం ఆరోగ్య పరీక్షలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. పూర్తి ఆరోగ్యవంతంగా ఉన్నప్పుడే విధుల్ని సమర్థంగా నిర్వహించగలుగుతామని సూచించారు. అనంతరం ప్రవాసభారతీయురాలు డాక్టర్ దేవభక్తుని రమాదేవి అందజేసిన విరాళంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రేపల్లె బ్రాంచి కొనుగోలు చేసిన బ్లడ్ బ్యాంక్ రిఫ్రిజిరేటర్‌ని జిల్లా ఎస్పీ ప్రారంభించారు. శిబిరంలో మణిపాల్ వైద్యులు శివకోటేశ్వరరావు, ఇమ్మానుయేలు, దత్తాదేవి సిబ్బందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐలు నజీర్‌బేగ్, శివశంకర్, సబ్ డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది, రేపల్లె ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ వసంతం వీరరాఘవయ్య, విజయవాడ మణిపాల్ హాస్పిటల్ డాక్టర్స్ బృంద సభ్యులు పాల్గొన్నారు.

నేరాల్ని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు

నేరాల్ని అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ చెప్పారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం రేపల్లె సర్కిల్ కార్యాలయానికి వచ్చిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంతో పోల్చుకుంటే ఈ ఏడాది జిల్లాలో క్రైం రేటు అదుపులో ఉందని తెలిపారు. జిల్లావ్యాప్తంగా గత ఏడాది 4,700 కేసులు నమోదవ్వగా, ఇప్పటిదాకా 3,100 వివిధ దశల్లో విచారణలో ఉన్నాయని వెల్లడించారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ కేసుల్ని పరిష్కరిస్తున్నామని వివరించారు. మెగా లోక్‌అదాలత్‌ల ద్వారా అధిక సంఖ్యలో కేసులు పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. సమస్యాత్మక ప్రాంతాల్ని గుర్తించి నేరాలు జరగకుండా నిరంతరం సిబ్బందితో ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. జిల్లాలో తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాల్ని గుర్తించి యాక్సిడెంట్ జోన్లుగా గుర్తించడంతో పాటు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. రహదారి ప్రమాదాల్ని నివారించి ప్రాణాపాయాన్ని తగ్గించేందుకు ప్రతివారం వాహన చోదకులకు అవగాహన సదస్సులు, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నేరాల నియంత్రణకు, ఆగంతకుల్ని పట్టుకోవడంలో సీసీ కెమెరాలు ఎంతగానో దోహదం చేస్తాయని ఎస్పీ చెప్పారు. పట్టణంలో రద్దీగా ఉండే ప్రాంతాలతో పాటు ముఖ్యమైన ప్రదేశాల్లో జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసి, నిత్యం పనిచేసేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. పట్టణంలో పలుచోట్ల సీసీ కెమెరాలు పనిచేయడం లేదని గుర్తించామని, వాటికి మరమ్మతులు నిర్వహించి వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు. రౌడీషీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డుల్ని తనిఖీ చేసి, పరిసరాల్ని పరిశీలించారు. స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు. అనంతరం డివిజన్ పరిధిలోని పోలీసు సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. విధుల నిర్వహణలో మహిళా పోలీసుల సమస్యల్ని తెలుసుకుని వాటి పరిష్కారానికి మార్గాలు చెప్పారు. కార్యక్రమంలో డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ, సీఐలు నజీర్‌బేగ్, శివశంకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు

బాలల హక్కుల కమిటీ సభ్యురాలు పద్మావతి



సమావేశంలో మాట్లాడుతున్న పద్మావతి

వేటపాలెం: అధికారులంతా సమన్వయంతో పని చేస్తూ బాల్య వివాహాల నిరోధానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని బాలల హక్కుల కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి సూచించారు. మండలం పరిషత్ సమావేశ హాలులో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు–అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో బాలల హక్కుల్ని కాపాడడంలో రాష్ట్రం ఐదో స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో అనంతపురం ఒకటో స్థానం, ప్రకాశం జిల్లా రెండో స్థానంలో ఉందని తెలిపారు. బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. తల్లిదండ్రుల నిరక్షరాస్యతతో పాటు లింగవివక్ష కారణంగా ఎక్కువగా బాల్య వివాహాలు జరుగుతున్నాయని తెలిపారు. వీటిని ముందుగానే గుర్తించి అరికట్టాల్సిన అవసరం ఉందని సూచించారు. బాల్య వివాహాల వల్ల అనారోగ్యంతో పాటు అనర్థాలు చోటు చేసుకుంటాయని పేర్కొన్నారు. చదువుకొనే వయసులో బలవంతంగా వివాహం చేయడం వల్ల వారి బంగారు భవిష్యత్ అంధకారంగా మారుతుందని తెలిపారు. ఇటువంటి వాటిపై కఠినంగా వ్యవహరించి, అవసరమైతే కేసులు నమోదు చేయాలని పద్మావతి సూచించారు. విద్యాశాఖ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు డ్రాపవుట్లను గుర్తించి వారిని బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమ, వైద్యాధికారి శ్యాంసన్, డాక్టర్ బాలరాజు, ఎంఈవో సుబ్బయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిప్పర్ హైడ్రాలిక్ కూలి డ్రైవర్ మృతి



బాపట్ల టౌన్: టిప్పర్ హైడ్రాలిక్ కూలి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని వెదుళ్లపల్లి సమీపంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరు జిల్లా రేపల్లెవాడకు చెందిన వెంకటేష్ నెల రోజుల కిందట పొన్నూరుకు చెందిన రెహ్మాన్ వద్ద టిప్పర్ డ్రైవర్‌గా చేరాడు. గురువారం టిప్పర్ హైడ్రాలిక్ మరమ్మతులకు గురికావడంతో బాగు చేసేందుకు కింద భాగంలో చూస్తున్నారు. ఇదే సమయంలో హైడ్రాలిక్ పైపు నుంచి ఆయిల్ లీకై ఒక్కసారిగా టిప్పర్ కిందకు దిగడంతో కింద భాగంలో ఉన్న వెంకటేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు వెదుళ్లపల్లి ఎస్ఐ నాగశ్రీను కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వెలవెలబోయిన యువగళం సంఘీభావ యాత్ర

- యాభై మంది కూడా లేని ర్యాలీ
- నిరుత్సాహంతో మాట్లాడకుండానే వెళ్లిపోయిన టీడీపీ ఇన్‌చార్జి



జనం లేక వెలవెలబోతున్న సభ

చీరాల: టీడీపీ నాయకుడు నారా లోకేష్ యువగళం 200 రోజులు పూర్తి చేసుకున్నందున టీడీపీ నేతలు చీరాల్లో చేపట్టిన సంఘీభావ యాత్రలు కార్యకర్తలు, నాయకులు లేక వెలవెలబోయింది. చీరాల టీడీపీ ఇన్‌చార్జి ఎం.ఎం. కొండయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి నియోజకవర్గ స్థాయిలో చేపట్టిన సంఘీభావ యాత్రకు టీడీపీ నాయకులు, కార్యకర్తల నుంచి కనీస స్పందన రాలేదు. ర్యాలీ కోసం ఈపురుపాలెం నుంచి పందిళ్లపల్లి వరకు జోరుగా ప్రచారం చేసినప్పటికీ కనీసం 50 మంది కూడా యాత్ర, సభకు హాజరు కాలేదు. నిత్యం వందలాది మంది రాకపోకలు సాగించే గడియార స్తంభం సెంటర్‌లో టీడీపీ సభకు స్పందన లేకపోవడంతో నాయకులు తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. పెద్దఎత్తున ప్రచారం చేపట్టి వాహనాల రాకపోకలు బైపాస్‌లోకి మళ్లించినప్పటికీ కనీసం సభకు జనం లేకపోవడంపై అంతా నవ్వుకున్నారు. బహిరంగ సభలో జనం లేకపోవడం, కార్యకర్తల నుంచి స్పందన లేకపోవడంతో మాట్లాడకుండానే ఆ పార్టీ ఇన్‌చార్జి కొండయ్య మైక్ ఇచ్చేసి వెళ్లిపోయారు. జాతీయ పార్టీ అని చెప్పుకునే టీడీపీకి చీరాల్లో కార్యకర్తలు, నాయకులు లేరని ప్రజలు బహిరంగానే నవ్వుకున్నారు.

రేపు ఏపీ ఎస్ఆర్ఎం వర్సిటీ స్నాతకోత్సవం

తాడేపల్లిరూరల్ : మంగళగిరి రూరల్ పరిధి నీరుకొండలోని ఎస్ఆర్ఎం వర్సిటీ 3వ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు చాన్సలర్ డాక్టర్ టిఆర్ పారివేందర్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ముఖ్య అతిథిగా తెలంగాణ గవర్నర్ డాక్టర్ తమిళిసై పాల్గొననున్నట్లు తెలిపారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ ప్రెసిడెంట్, మాజీ డీఎస్‌డీ సెక్రటరీ డాక్టర్ అశుతోష్‌శర్మకు గౌరవ డాక్టరేట్ అందజేయనున్నామని పేర్కొన్నారు. తెలంగాణ గవర్నర్ చేతుల మీదుగా 883 మంది ఇంజినీరింగ్ విద్యార్థులకు డిగ్రీలు, మెడల్స్ , ఉత్తమ ప్రతిభ కనబర్చిన 17 మంది విద్యార్థులకు బంగారు పతకాలు, ఆరుగురికి సిల్వర్ మెడల్స్, ఇద్దరి బ్రాంజ్ మెడల్స్ ప్రదానం చేయనున్నామని తెలియజేశారు. 13 మంది పీహెచ్‌డీ విద్యార్థులకు డిగ్రీలు అందజేయనున్నామని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.

జీజీహెచ్‌లో రూ. 40 లక్షలతో స్టెప్ డౌన్ ఐసీయూ




స్టెప్ డౌన్ ఐసీయూ పనులు పర్యవేక్షిస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ రూ. 40 లక్షలతో అధునాతన వెంటిలేటర్‌లతో స్టెప్‌డౌన్ ఐసీయూను అభివృద్ధి చేస్తున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. గురువారం ఆసుపత్రిలోని స్టెప్ డౌన్ ఐసీయూ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద రోగుల ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేస్తూ నిధులు విడుదల చేస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగా జీజీహెచ్‌లో వెంటిలేటర్ ఐసీయూను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అత్యవసర వైద్య విభాగానికి అనుబంధంగా స్టెప్‌డౌన్ ఐసీయూను నిర్మిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రోత్సాహంతో, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రిలో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. కొత్తగా నిర్మిస్తున్న ఐసీయూలో ప్రతి బెడ్‌కు వెంటిలేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎం.టి.కృష్ణ బాబు ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించారన్నారు. అందులో రూ.40 లక్షలు స్టెప్ ఐసీయూ కోసం ఖర్చు పెడుతున్నామని వెల్లడించారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తిచేసి సెప్టెంబర్ మాసానికి అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డీఎస్ఎస్ శ్రీనివాస ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని, సమీనా బేగం పాల్గొన్నారు.

ఆర్‌బీకేలను సద్వినియోగం చేసుకోవాలి

ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ఈపూరు: రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంటున్నాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఈపూరులో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ రైతులతో సమావేశమై చర్చించారు. రైతులు తమకు వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు రాయితీపై కావాలని ఎంపీ దృష్టికి తీసుకురాగా.. స్పందించిన ఆయన మంత్రితో ఈ విషయంపై చర్చించి పనిముట్లు రాయితీపై వచ్చేలా చూస్తామన్నారు. ఆర్బీకేల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పలు సేవలను ప్రతిఒక్క రైతు సద్వినియోగంచుకోవాలని సూచించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్.రామారావు, ఉద్యానవన శాఖ అధికారులు డి.నవీన్‌కుమార్, ఎస్‌కే నబీ రసూల్, వ్యవసాయ సహాయకుడు ఎం.శేషుబాబు పాల్గొన్నారు.

రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా అనురాధారెడ్డి



నియామకపత్రాన్ని అందుకుంటున్న అనురాధారెడ్డి

నరసరావుపేట రూరల్: రెడ్డి జేఏసీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలిగా సీహెచ్ అనురాధారెడ్డి నియమితులయ్యారు. విశాఖపట్నంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి జేఏసీ గౌరవ అధ్యక్షుడు పాలిమేర వెంకటరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు విప్పల శివకుమార్‌రెడ్డి చేతుల మీదగా నియామకపత్రాన్ని అనురాధా రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా అనురాధారెడ్డి మాట్లాడుతూ జేఏసీ మహిళా విభాగం బలోపేతానికి కృషిచేస్తానని తెలిపారు.

రేపు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం

గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల వార్షిక సమావేశాన్ని శనివారం ఉదయం 9.00 గంటలకు గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ గురువారం తెలిపారు. ఆడుదాం ఆంధ్ర, జోనల్ క్రీడల నిర్వహణపై నిర్వహిస్తున్న సమావేశానికి జిల్లావ్యాప్తంగా వ్యాయామ ఉపాధ్యాయుల్ని విధిగా పంపాలని ప్రధానోపాధ్యాయుల్ని ఆదేశించారు.